సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం । 3 । జూలై । 2024



ప్రతి ఎకరాకూ నీరందించాలి

సీతారామ ద్వారా జిల్లాలోని ప్రతి ఎకరాకూ నీరందించాలని మాజీ ఎమ్మెల్యేలు హరిప్రియ, గుమ్మడి నర్సయ్య డిమాండ్ చేశారు. 8లో



తుక్కులోనూ కుంభకోణం?

కాలం చెల్లిన కేటీపీఎస్ ఓఅండ్ఎం నుంచి తుక్కు తరలింపు వ్యవహారంలో భారీ కుంభకోణం జరిగిందనే ఆరోపణలున్నాయి. 8లో

గరిష్టం / కనిష్టం
33° / 25°

వాతావరణం

జిల్లాలో బుధవారం వాతావరణం చల్లగానే ఉంటుంది. సాయంత్రం నుంచి పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంటుంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపించారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని శ్రీ అభయాంజనేయస్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకం చేశారు.

క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు ఎంపికలు



పరుగుపందెం పోటీలో విద్యార్థులు..

కొత్తగూడెంటౌన్: క్రీడా పాఠశాలలో నాలుగో తరగతిలో ప్రవేశాల కోసం స్థానిక ప్రకాశం స్టేడియంలో మంగళవారం ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి కె.సంజీవరావు మాట్లాడుతూ.. మండలస్థాయిలో ఎంపికైన 120 మంది బాలబాలికలు జిల్లాస్థాయిలో ప్రవేశాల కోసం హాజరయ్యారని తెలిపారు. వీరందరికీ తొమ్మిది బ్యాటరీ టెస్టులు నిర్వహించగా.. 14 మంది బాలురు, 10 మంది బాలికలు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈ 24 మందిని ఈనెల 9, 10 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని చెప్పారు.

జీటీ-1 ట్రాన్స్‌ఫార్మర్ మార్చాల్సిందే!

- బీహెచ్‌ఈఎల్ అధికారుల నివేదిక
- కొత్తవి ఎక్కడ ఉన్నాయోనని ఆరా..

మణుగూరు టౌన్: మణుగూరులోని భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో యూనిట్-1 జనరేషన్ ట్రాన్స్‌ఫార్మర్ శనివారం రాత్రి దగ్ధమైన విషయం విదితమే. ఈ నేపథ్యాన భోపాల్ నుంచి వచ్చిన బీహెచ్‌ఈఎల్ అధికారులు సోమవారం ఉదయం నుంచి మంగళవారం సాయంత్రం వరకు కాలిపోయిన జీటీ-1 ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించి నివేదిక అందించినట్లు తెలిసింది. ఈ ట్రాన్స్‌ఫార్మర్ పూర్తిగా కాలిపోయిన నేపథ్యాన మరమ్మతులకు అవకాశం లేదని తేల్చిచెప్పినట్లు సమాచారం. తొలుత బీహెచ్‌ఈఎల్‌దే బాధ్యత అని భావించినా, సీఓడీ అయ్యాక ఏడాది వరకు మాత్రమే బీహెచ్‌ఈఎల్ బాధ్యత వహిస్తుందని నిర్ధారణకు వచ్చారు. అలాగే, బీమా కంపెనీ అధికారులు పరిశీలించి రూ.9 కోట్ల మేర రికవరీ అయ్యే అవకాశం ఉందని వెల్లడించినట్లు తెలిసింది. ఈ మేరకు మహారాష్ట్రలోని అమరావతి వద్ద 250 మెగావాట్ల జీటీ ఉన్నట్లు తెలియగా, అసోంలోని ఎన్‌టీపీసీ వద్ద 270 మెగావాట్లది ఉన్నట్లు తెలియడంతో వివరాలు ఆరా తీస్తున్నారు. ఒకవేళ కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను భోపాల్ పంపి మరమ్మతు చేయించాలంటే ఆరు నెలలు, కొత్తది అమర్చాలంటే మూడు నెలల సమయం పడుతుందని భావిస్తున్నట్లు సమాచారం. దీంతో మరింత త్వరగా అందుబాటులోకి తీసుకొచ్చేలా ఎక్కడైనా థర్మల్ ప్లాంట్‌లో ఈ తరహా ట్రాన్స్‌ఫార్మర్ అందుబాటులో ఉందా అని ఆరా తీస్తున్నట్లు తెలిసింది.



ఆధునిక వైద్యం.. అందని ద్రాక్షే!

జ్వరం, దగ్గు, తలనొప్పి, విషజ్వరాలు వంటి సాధారణ వ్యాధులకు తప్పితే ఆధునిక, అత్యవసర వైద్యం భద్రాచలంలో అందని ద్రాక్షగానే మారింది. ప్రాణాలు దక్కాలంటే ఖమ్మం, వరంగల్, హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లాల్సి వస్తోంది. ఇలా వెళ్తున్న వారిలో నందు తరహాలో ప్రాణాపాయం తప్పుతున్న వారు కొందరే ఉంటే ఎక్కువ మంది ఆ అదృష్టానికి నోచుకోలేక పోతున్నారు. – సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

నాలుగు రాష్ట్రాల కూడలిగా భద్రాచలం

- ఏజెన్సీ ప్రజలకు అందని 'సూపర్' సేవలు
- ఎయిమ్స్ తరహా ఆస్పత్రి వస్తేనే న్యాయం
- కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలంటున్న వైద్య నిపుణులు

కూడలిగా భద్రాచలం

నిన్నా మొన్నటి వరకు భద్రాచలం పట్టణం అంటే శ్రీరాముడు కొలువైన క్షేత్రంగానే ప్రసిద్ధి. టెంపుల్ టౌన్ అనే దృష్టితోనే ఇక్కడ అభివృద్ధి పనులు చేపట్టేవారు. కానీ రవాణా సౌకర్యాలు మెరుగయ్యాక భద్రాచలం పట్టణ స్థితిగతుల్లో మార్పు వచ్చింది. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల్లోని ఏజెన్సీ ప్రజలు వివిధ అవసరాల నిమిత్తం భద్రాచలం పట్టణంపైనే ఆధారపడుతున్నారు. ఒకప్పుడు భద్రాచలంలో వివిధ వ్యాపార సంస్థలకు సంబంధించిన బోర్డులు తెలుగు, ఇంగ్లిష్ భాషల్లోనే ఉండేవి. కానీ ఇప్పుడు మారిన పరిస్థితులకు తగ్గట్టుగా హిందీ, ఒడిశా భాషల్లోనూ నేమ్‌బోర్డులు రాస్తున్నారు. నిత్యావసర సరుకులు, రవాణాతో పాటు వైద్య పరమైన సేవల కోసం సరిహద్దులో ఉన్న మూడు రాష్ట్రాల ప్రజలు భద్రాచలానికే వస్తున్నారు.

గిరిజనులే అధికం

వైద్య సాయం కోసం భద్రాచలం వచ్చే వారిలో 90 శాతం మంది నాలుగు రాష్ట్రాల్లోని ఏజెన్సీకి చెందిన పేద గిరిజనులే ఉంటున్నారు. అయితే వీరి అవసరాలను తీర్చే స్థాయిలో భద్రాచలం ఏరియా ఆస్పత్రి లేదు. 200 పడకలతో నిత్యం ఈ ఆస్పత్రి కిటకిటలాడుతోంది. అయినా ఇప్పటికీ మౌలిక సదుపాయల్లో లోపాలు, సిబ్బంది కొరత వంటి సమస్యలు పీడిస్తున్నాయి. ఫలితంగా ఆర్థికంగా, సామాజికంగా, ఆరోగ్యపరంగా వెనుకబడిన ఏజెన్సీ గిరిజనులకు సాధారణ వైద్యం తప్ప ఆధునిక వైద్యం ప్రభుత్వ పరంగా లభించడం లేదు. దీంతో కాలినడకన, డోలీల్లో, కొండ కోనలు దాటి అప్పులు చేసి భద్రాచలం వచ్చే ఆదివాసీలకు సూపర్ స్పెషాలిటీ తరహా వైద్యం అందని ద్రాక్షే అవుతుంది.

కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలి..

జిల్లా కేంద్రంలోని కొత్తగూడెంలో ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కాలేజీని అందుబాటులోకి తెచ్చింది. దీంతో భద్రాచలంలో ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చే బాధ్యతలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని ఏజెన్సీ వాసులు కోరుతున్నారు. ఆలిండియా ఇనిస్ట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) పేరుతో కేంద్రం ప్రత్యేక ఆస్పత్రులను నిర్వహిస్తోంది. అయితే రాష్ట్ర విభజన చట్టంలో తెలంగాణకు ప్రకటించిన ఎయిమ్స్ ఆస్పత్రిని యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్‌కు కేటాయించారు. ఈ నేపథ్యంలో భద్రాచలం చుట్టుపక్కల ఉన్న ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఏపీలోని గిరిజన జనాభా, అక్కడి ప్రజల ఆర్థిక, ఆరోగ్య స్థితిగతులు, మావోయిస్టుల ప్రభావం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఎయిమ్స్ తరహా ఆస్పత్రి లేదా ట్రైబల్ మెడికల్ హబ్ పేరుతో భద్రాచలానికి ప్రత్యేక ప్యాకేజీతో మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఈ మేరకు ప్రజాప్రతినిధులు కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని నాలుగు రాష్ట్రాలకు చెందిన వైద్య నిపుణులు సైతం సూచిస్తున్నారు.

జిల్లాకు నిధుల వరద..

తెలంగాణ వచ్చిన తర్వాత, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏర్పాటయ్యాక మునుపెన్నడూ లేని విధంగా కేంద్రం నుంచి కీలక ప్రాజెక్టులు జిల్లాకు మంజూరవుతున్నాయి. కొత్తగూడెం బైపాస్‌రోడ్డు, భద్రాచలం పట్టణంలో ప్రధాన రహదారి విస్తరణ, కిన్నెరసానిపై రెండో వంతెన, కొత్తగూడెం – ఇల్లెందు – మహబూబాబాద్ హైవే నిర్మాణ పనులు వంటి విషయంలో సానుకూల ఫలితాలు వస్తున్నాయి. ఈ మేరకు ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు విజయం సాధిస్తున్నారు. ఇదే క్రమంలో నాలుగు రాష్ట్రాలకు కూడలిగా ఉన్న భద్రాచలంలో వైద్య సౌకర్యాలు మెరుగుపరిచేలా కేంద్రం నుంచి ప్రత్యేక నిధులు, ప్యాకేజీ సాధించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

భద్రాచలం పట్టణానికి చెందిన చిన్నారి రియాన్సికకు సోమవారం ప్రమాదవశాత్తు తలలో పెన్ను గుచ్చుకుపోవడంతో భద్రాచలం ఆస్పత్రికి తీసుకెళ్లారు. సరైన వైద్య సదుపాయాలు లేకపోవడంతో హుటాహుటిన ఖమ్మం తరలించారు. అక్కడ సర్జరీ చేసిన వైద్యులు చిన్నారిని ప్రాణాపాయం నుంచి బయటపడేశారు.

ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాకు చెందిన సోది నందు అనే యువకుడి ఛాతిలోకి ప్రమాదవశత్తు బాణం దిగడంతో వెంటనే రాష్ట్ర సరిహద్దులు దాటుకుని భద్రాచలం వచ్చారు. ఇక్కడ ఆధునిక వైద్యం అందుబాటులో లేకపోవడంతో హైదరాబాద్‌లో నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు శ్రమించి ఛాతిలో దిగిన బాణాన్ని తీసేసి నందును కాపాడారు. ఏజెన్సీ వాసికి నిమ్స్‌లో అందించిన వైద్య సాయంపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రశంసించారు.

'సూపర్' సేవలు అందించాలి..

రవాణా సౌకర్యాలు గొప్పగా లేని ఏజెన్సీ వాసులు ఆరోగ్యపరంగా అత్యవసర పరిస్థితి ఎదురైతే కష్టనష్టాలకోర్చి భద్రాచలం ఆస్పత్రికి చేరుకుంటున్నారు. అయితే ఇక్కడ ఎంఆర్ఐ, సీటీ స్కాన్, 2డీ ఎకో వంటి సౌకర్యాలు లేకపోవడం లోటుగా ఉంది. అలాగే గుండె, న్యూరో, యూరాలజీ వంటి విభాగాల్లో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి తేవాల్సిన అవసరం ఉంది. అన్నింటికంటే ముఖ్యంగా ఈ ఆస్పత్రిలో ఖాళీలను వెంటనే భర్తీ చేయాల్సిన అవసరం ఉంది.

టార్గెట్ 72 మిలియన్ టన్నులు

- రోజుకు 2 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి
- వర్షాకాలంలో ఉత్పత్తి తగ్గకుండా చర్యలు
- రాబోయే ఐదేళ్లలో 10 కొత్త గనులు ప్రారంభం
- సింగరేణి సీఎండీ బలరామ్ దిశానిర్దేశం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎండీ బలరామ్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఎన్ని ఆటంకాలు ఎదురైనా ఈ ఆర్థిక సంవత్సరంలో 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలని సింగరేణి సీఎండీ ఎన్ బలరాం దిశానిర్దేశం చేశారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సంస్థ డైరెక్టర్లు, ఏరియా జీఎంలతో మంగళవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వర్షాకాలంలో ఉత్పత్తికి విఘాతం కలగకుండా రోజుకు 2 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలన్నారు. అదే విధంగా ప్రతీ రోజు 13 లక్షల టన్నుల ఓవర్ బర్డెన్ తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. నిర్దేశిత లక్ష్యాలను చేరేందుకు వీలుగా హాల్ రోడ్లను ఎప్పటికప్పుడు పటిష్టపరచుకోవాలని, క్వారీల్లో నిలిచిన వర్షపు నీటిని ఎప్పటికప్పుడు పంపింగ్ చేయాలని సూచించారు. ఏదైనా షిఫ్ట్‌లో వర్షంతో ఉత్పత్తికి నష్టం వాటిల్లితే మరుసటి షిఫ్ట్‌లో ఆ నష్టాన్ని భర్తీ చేయాలన్నారు. ఉద్యోగులంతా తమకు కేటాయించిన 8 గంటల పూర్తి సమయం పనిచేసే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు.

పది కొత్త గనులు

రాబోయే ఐదేళ్లలో పది కొత్త గనులు ప్రారంభించడంతో పాటు 100 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు సీఎండీ వివరించారు. రాబోయే మూడు నెలల్లో ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాక్ నుంచి ఉత్పత్తి ప్రారంభమవుతుందని ధీమా వ్యక్తం చేశారు. కొత్త గనులకు రావాల్సిన అనుమతులు, ఇతర ఏర్పాట్లను ప్రణాళికాయుతంగా పూర్తి చేయాలని సూచించారు. దీంతోపాటు నూతన ప్రాజెక్టులు, అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టు, ఇతర కంటిన్యూయస్ మైనర్ల పనితీరుపై సమీక్షలో చర్చించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సంస్థ డైరెక్టర్లు డి. సత్యనారాయణరావు, ఎన్.వీ.కే. శ్రీనివాస్, జి.వెంకటేశ్వర్ రెడ్డి, జీఎంలు జి.దేవేందర్, రవికుమార్ పాల్గొన్నారు.

వన మహోత్సవ లక్ష్యాలను పూర్తిచేయాలి

- జిల్లాలో 65.14 లక్షల మొక్కలు నాటాలి
- కలెక్టర్ జితేష్ వి పాటిల్



దమ్మపేట తహసీల్దార్ కార్యాలయంలో మట్లాడుతున్న కలెక్టర్ జితేష్

సూపర్‌బజార్(కొత్తగూడెం): వన మహోత్సవ లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. వన మహోత్సవంలో భాగంగా శాఖల వారీగా మొక్కలు నాటే లక్ష్యాలపై మంగళవారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ ఏడాది జిల్లాలో 65.14 లక్షలు నాటలని లక్ష్యంగా నిర్ణయించినట్టు తెలిపారు. దీన్ని అధిగమించేందుకు అన్ని శాఖలు కృషి చేయాలన్నారు. జిల్లాలోని అటవీశాఖ నర్సరీల నుంచి మొక్కలు తీసుకుని కార్యాచరణ ప్రారంభించాలని సూచించారు. జిల్లాకు కేటాయించిన లక్ష్యం మేరకు మొక్కలు నాటేలా స్థలాల గుర్తింపు, గుంతల తవ్వకం చేపట్టాలని ఆదేశించారు. మొక్కలు నాటడంతో పాటు సంరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. నాటిన ప్రతి మొక్కకూ జియో ట్యాగింగ్ చేయాలని చెప్పారు. ప్రతి పాఠశాల ఆవరణలో మునగ, కరివేపాకు, చింత, ఉసిరి, వెలగ మొక్కలు తప్పనిసరిగా ఉండాలని విద్యాశాఖాధికారులకు సూచించారు. కాల్వలకు ఇరువైపులా సుబాబుల్ మొక్కలు నాటాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

'సంపూర్ణ అభియాన్'ను విజయవంతం చేయాలి

సంపూర్ణ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ జితేష్ అన్నారు. కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు కావాల్సిన విద్య, వైద్యం, పౌష్టికాహారం, వ్యవసాయం తదితర అంశాల్లో అభివృద్ధిని వేగవంతం చేయాలని సూచించారు. సంపూర్ణ అభియాన్ కార్యక్రమాన్ని జిల్లా స్థాయిలో 4వ తేదీన, గుండాల మండలంలో 5వ తేదీన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇంటింటి సర్వే నిర్వహించి గర్భిణుల వివరాల నమోదు చేయాలని, వారికి బీపీ, షుగర్ పరీక్షలు చేయాలని, పోషకాహారం అందించాలని వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. ఆయా కార్యక్రమాల్లో డీఆర్‌డీఓ విద్యాచందన, డీఎఫ్‌ఓ కృష్ణగౌడ్, సీపీఓ శ్రీనివాసరావు, మహిళా శిశు, సంక్షేమాధికారి విజేత, డీఎంహెచ్‌ఓ భాస్కర్ నాయక్, టెక్నికల్ ఏడీఏ సాయి నారాయణ, సీఎంఓ నాగ శేఖర్, ఆస్పిరేషన్ అధికారి నవనీత్ పాల్గొన్నారు.

ధరణి దరఖాస్తులు పరిష్కరించాలి..

దమ్మపేట: పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. మంగళవారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించాలని, క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి నివేదిక సమర్పించాలని తహసీల్దార్ నరేష్‌కు సూచించారు. శుక్రవారం నాటికి దరఖాస్తులన్నింటికీ రిపోర్టులు అందజేయాలని ఆదేశించారు.

రేపు జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు

చుంచుపల్లి: జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలు గురువారం ఉదయం 10 గంటల నుంచి జెడ్పీ హాల్‌లో నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ సీఈఓ కె.చంద్రశేఖర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సమావేశాలకు ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం



ఆపరేషన్ ముస్కాన్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎస్పీ తదితరులు

ఎస్పీ రోహిత్‌రాజ్ పిలుపు

కొత్తగూడెంటౌన్: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్పీ రోహిత్‌రాజ్ అన్నారు. మంగళవారం ఎస్పీ కార్యాలయంలో ఆపరేషన్ ముస్కాన్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 1 నుంచి 31 వరకు జిల్లాలో పటిష్ట ప్రణాళికతో ముస్కాన్ కార్యక్రమాన్ని అమలు చేస్తామని చెప్పారు. ప్రతి సబ్ డివిజన్ పరిధిలో ఒక ఎస్సై, నలుగురు సిబ్బందితో కలిపి బృందాలుగా నియమించామని తెలిపారు. బడీడు పిల్లలు పనులకు వెళ్తుంటే గుర్తించి బడిలో చేర్పించాలన్నారు. బాలబాలికలతో పని చేయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా బాలలతో వెట్టి చాకిరీ చేయిస్తున్నట్లు తెలిస్తే పోలీస్ శాఖకు సమాచారం అందించాలని కోరారు. లేదంటే డయల్ 100, 1098 ఫోన్ చేయాలన్నారు. కాగా, కొత్తగూడెం ఐఎంఏ హాల్‌లో డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులతో ఆపరేషన్ ముస్కాన్ పై సమావేశం నిర్వహించారు. సమావేశంలో డీసీఆర్బీ సీఐ శ్రీనివాస్, ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్ నాగరాజురెడ్డి, ఆయా శాఖల అధికారులు అన్నామణి, షర్ఫుద్దీన్, సుమిత్రాదేవి, సాధిక్‌పాషా, శివకుమారి, సందీప్, ఎస్సైలు రమాదేవి, విజయలక్ష్మి, రవి, తిరుపతి, సోమేశ్వర్, ఏసోబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఏఆర్ కానిస్టేబుల్‌కు చెక్కు..

బూర్గంపాడులో గత ఏడాది జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయిన ఏఆర్ కానిస్టేబుల్ శ్రీరామ్‌కు రూ.7 లక్షల చెక్కును ఎస్పీ రోహిత్‌రాజు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉద్యోగ రీత్యా వివిధ ప్రాంతాలకు వెళ్లి విధులు నిర్వహించే పోలీసులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్యాలయ ఏఓ జయరాజు, సూపరింటెండెంట్ సత్యవతి, ఆర్ఐ నర్సింహారావు పాల్గొన్నారు.

ఉత్తమ అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెంఅర్బన్: జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కోసం జిల్లాలోని అర్హులైన ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వరాచారి సూచించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా పరిషత్, ప్రభుత్వ, ఎనర్జీ ఎడ్యుకేషన్ సొసైటీ, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూళ్లలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అర్హులైన ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, సంబంధిత దరఖాస్తును ఈనెల 15లోగా తమ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

'విలీనం' చర్చకొచ్చేనా ?

- సీఎంల భేటీలో పంచాయతీల ప్రస్తావనపై ఆశలు..
- విలీన గ్రామాలు కలిస్తేనే భద్రాచలానికి మళ్లీ ఊపిరి
- ఐదు పంచాయతీలపై ఇప్పటికే మంత్రి తుమ్మల హామీ
- ఈనెల 6న ఏపీ, తెలంగాణ ముఖ్యమంత్రుల సమావేశం



ఎమ్మెల్యే వెంకట్రావ్‌కు వినతిపత్రం అందచేస్తున్న విలీన గ్రామాల ప్రజలు

భద్రాచలం : విభజన అంశాలపై చర్చించేందుకు ఈనెల 6న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రులు భేటీ కానున్నారు. ఈ నేపథ్యంలో భద్రాచలం మండలం నుంచి విడిపోయి ఏపీలో కలిసిన ఐదు గ్రామపంచాయతీల ప్రస్తావనపై ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి. తమ గ్రామాలను తెలంగాణలో కలిపేలా సీఎం దృష్టికి తీసుకెళ్లాలని ఆ ఐదు పంచాయతీలకు చెందిన పలువురు మంగళవారం స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్‌కు వినతిపత్రం అందజేశారు.

భద్రాచలంలో అంతర్భాగమే..

తెలంగాణ, ఏపీ విభజనకు ముందు భద్రాచలం డివిజన్‌లో యటపాక, పురుషోత్తపట్నం, గుండాల, పిచుకలపాడు, కన్నాయిగూడెం పంచాయతీలు అంతర్భాగంగా ఉండేవి. రాష్ట్ర విభజన సమయంలో పోలవరం ముంపు పేరుతో స్థానికుల అభిప్రాయాలు సేకరించకుండానే ఈ గ్రామాలను ఏపీలో కలిపారు. దీంతో భద్రాచలం విస్తీర్ణం తీవ్రంగా కుచించుకుపోయింది. పట్టణ విస్తరణకు అవకాశం ఉన్న భూభాగం ఏపీలోకి వెళ్లడంతో భద్రాచలం అభివృద్ధి సైతం కుంటుపడింది. భద్రాచలం పుణ్యక్షేత్రంతో పాటు పర్యాటక ప్రాంతంగా, మూడు రాష్ట్రాల గిరిజనులకు వ్యాపార కేంద్రంగా ఉండడంతో నానాటికీ జనాభా సైతం పెరుగుతోంది. అనధికారిక లెక్కల ప్రకారం ఇప్పటికే పట్టణ జనాభా లక్ష దాటింది. దీంతో ఆవాస ప్రాంతాలకు సరైన స్థలం, ప్రభుత్వ అభివృద్ధి పనులకు అవసరమైన స్థలం లేకపోవడంతో ఆ పంచాయతీలను తిరిగి తెలంగాణలో కలపాలని స్థానికులు అప్పటి నుంచీ డిమాండ్ చేస్తూనే ఉన్నారు. భద్రాచలం దేవస్థానానికి చెందిన సుమారు 900 ఎకరాల భూమి పురుషోత్తపట్నంలోనే ఉంది. దీంతో రామాలయ అభివృద్ధి పనులు సైతం ముందుకు సాగడం లేదు.

ప్రజాప్రతినిధులకు వినతులు..

ఏపీలో కలిసిన విలీన గ్రామాల ప్రజలు సైతం తమను తిరిగి తెలంగాణ లో కలపాలని కోరుతున్నారు. ఈ మేరకు రెండు రాష్ట్రాల అధికారులకు, తెలంగాణ ప్రజాప్రతినిధులకు వినతులు సమర్పిస్తూనే ఉన్నారు. పలుమార్లు రాస్తారోకోలు, మానవహారాలు, బంద్ వంటి కార్యక్రమాలతో నిరసన తెలిపారు. ఎన్నికల వేళ సైతం ఈ అంశం అన్ని పార్టీలకూ అస్త్రంగా మారింది. తాజాగా మంగళవారం కూడా ఆయా గ్రామాల వారు స్థానిక ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం సమర్పించారు. మళ్లీ గోదావరి వరదల సీజన్ రానుందని, ఇప్పటికే తాము అనేక ఇబ్బందులు పడుతున్నామని, ఏపీలోని జిల్లా కేంద్రం దూరంగా ఉండడంతో ఏ పని ఉన్నా అంత దూరం వెళ్లలేకపోతున్నామని ఆయన దృష్టికి తెచ్చారు. భౌగోళికంగా భద్రాచలంతో తమకు అనుబంధం ఉందని, రాష్ట్రాలు వేరు కావడంతో పిల్లల చదువులు, ఉద్యోగాలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అన్నారు.

సీఎంల భేటీలో చర్చించేనా..

రాష్ట్ర విభజన అంశాలపై ఈనెల 6న ఇరు రాష్ట్రాల సీఎంలు భేటీ కానున్నారని తెలుస్తోంది. దీంతో భద్రాచలం నుంచి విడిపోయిన ఐదు పంచాయతీలు తిరిగి తెలంగాణలో కలపాలనే డిమాండ్‌పై చర్చించాలని, ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ అంశాన్ని ఇద్దరు సీఎంల దృష్టికి తీసుకెళ్తానని జిల్లాకు చెందిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సైతం ఇటీవల హామీ ఇచ్చారు. మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ సైతం ఎన్నికల ప్రచారంలో భరోసా ఇచ్చారు. ఈ మేరకు అందరూ సమష్టిగా కృషి చేసి, ఈ సమస్య పరిష్కరించాలని అంటున్నారు.

వైద్యాధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలి

- ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి రాహుల్
- అశ్వాపురంలో పీహెచ్‌సీ, పశు వైద్యశాల తనిఖీ



పశువైద్యశాల సిబ్బందితో మాట్లాడుతున్న పీఓ

అశ్వాపురం: ఏజెన్సీ పరిధి మారుమూల గ్రామాలు, అటవీ ప్రాంతాల ఆదివాసీ, గిరిజనులకు వైద్యాధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండి 24 గంటల పాటు వైద్యం అందించాలని భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి బి.రాహుల్ సూచించారు. అశ్వాపురం పీహెచ్‌సీ, పశువైద్యశాలను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో రికార్డులు, ఫార్మసీ, ల్యాబ్ గదులను పరిశీలించడమే కాక చికిత్స పొందుతున్న వారితో మాట్లాడి వివరాలు ఆరా తీశారు. అలాగే, ఆశ వర్కర్లతో సమావేశమై సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గిరిజనులకు అవగాహన కల్పించాలని సూచించారు. కాగా, పశు వైద్యశాలకు వెళ్లిన సమయాన సిబ్బంది సరైన సమాధానం ఇవ్వకపోవడంతో వెటర్నరీ అసిస్టెంట్‌కు షోకాజ్ నోటీసు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ స్వర్ణలత, వైద్యాధికారి సంకీర్తన, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

భద్రాచలంటౌన్: ఉమ్మడి జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ గురుకుల కళాశాల, ఈఆర్ఎస్ కళాశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారంతో పాటు తాజా పండ్లు సరఫరా చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ ఏజెన్సీదారులను ఆదేశించారు. ఐటీడీఏ కార్యాలయంలో మంగళవారం ఆయన జీసీసీ, ఏజెన్సీల ద్వారా పండ్ల సరఫరా టెండర్లు ఖరారు చేశారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ.. గిరిజన గురుకులాలు, పాఠశాలల్లో గిరిజన విద్యార్థులకు పండ్ల సరఫరా విషయంలో నిబంధనలు పాటించకపోతే ఏజెన్సీలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయమై జీసీసీ అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ఆర్సీఓ వెంకటేశ్వరరాజు, జీసీసీ డీఎం దావీదు, ఏఓ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బీటీపీఎస్‌ను సందర్శించిన ఎమ్మెల్యే



ప్రమాదం జరిగిన ప్రాంతంలో ఎమ్మెల్యే, అధికారులు

మణుగూరురూరల్‌: మండలంలోని చిక్కుడు గుంట ప్రాంతంలో ఉన్న భద్రాద్రి థర్మల్‌ పవర్‌ స్టేషన్‌ (బీటీపీఎస్‌)ను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మంగళవారం సందర్శించారు. ఇటీవల ప్లాంట్‌లో అగ్ని ప్రమాదం జరిగిన నేపథ్యాన ట్రాన్స్‌ఫార్మర్‌ ప్రాంతాన్ని ఆయన పరిశీలించి వివరాలపై సీఈ బిచ్చన్నతో ఆరా తీశారు. బీటీపీఎస్‌, బీహెచ్‌ఈఎల్‌ ఉద్యోగులు పాల్గొన్నారు.

రామయ్యకు ముత్యాలహారం



ముత్యాల హారాన్ని ఆలయ ఈఓ రమాదేవికి అందజేస్తున్న సిద్దిపేట భక్తులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామ చంద్ర స్వామి వారికి సిద్దిపేటకు చెందిన భక్తులు మంగళవారం ముత్యాలహారం, లాకెట్‌ సమర్పించారు. చందలపల్రుకు చెందిన రంగారెడ్డి–లక్ష్మి దంపతులు రూ.1.90 లక్షల విలువైన శ్రీరామ పరివార్‌ లాకెట్‌ హారాన్ని ఆలయ ఈఓ రమాదేవికి అందించారు. అలాగే, ఏపీలోని అమలాపురం సమీప కల్లకూరు వాస్తవ్యులు రూ.25 వేల విలువైన కూలర్‌, కూలింగ్‌ వాటర్‌ మిషన్‌ అందించారు.

అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్‌

ములకలపల్లి: వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ భాస్కర్‌ నాయక్‌ అన్నారు. మండల కేంద్రంలోని మంగపేట పీహెచ్‌సీలో మంగళవారం నిర్వహించిన ఆశాడేలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. జనావాసాల మధ్య మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలని, పరిసరాల పరిశుభ్రత పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. మాతా శిశు సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం నూతనంగా నిర్మించిన పీహెచ్‌సీ అదనపు భవనాన్ని సందర్శించారు. డాక్టర్‌ సాయికల్యాణ్‌, ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాలు పాల్గొన్నారు.

మావోయిస్టు మిలీషియా సభ్యుడి లొంగుబాటు



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్‌పీ

చర్ల: మావోయిస్టు పార్టీకి చెందిన మిలీషియా సభ్యుడు మంగళవారం పోలీసుల ఎదుట లొంగిపోయాడు. భద్రాచలం ఏఎస్‌పీ పరితోష్‌ పంకజ్‌ చర్ల సీఐ రాజువర్మతో కలిసి వివరాలు వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్‌ రాష్ట్రంలోని సుకుమా జిల్లా కిష్టారం పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని జెట్టపాడు గ్రామానికి చెందిన మడవి జోగా అలియాస్‌ ఐత.. పుట్టపాడుకు చెందిన మిలీషియా కమాండర్‌ మడకం దేవా వద్ద మిలీషియా సభ్యుడిగా చేరి నిత్యావసరాలు, ఇతర సామగ్రి చేరవేస్తున్నాడు. తర్వాత మడవి జోగా లొంగిపోవాలని నిర్ణయించుకొని స్వచ్ఛందంగా వచ్చి చర్ల పోలీసులను ఆశ్రయించాడని ఏఎస్‌పీ తెలిపారు.

స్కూల్‌ సమయంలో బయటకెళ్లిన విద్యార్థి

దండించిన టీచర్‌

ఇల్లెందు: ఆరో తరగతి చదువుతున్న విద్యార్థి స్కూల్‌ సమయంలో తోటి విద్యార్థులతో కలిసి నేరేడు పండ్ల కోసం వెళ్లాడు. తిరిగి పాఠశాలకు వచ్చిన విద్యార్థిని టీచర్‌ దండించిన ఘటన స్థానిక సింగరేణి స్కూల్‌లో చోటుచేసుకుంది. చెరువు కట్ట ఏరియాకు చెందిన చంద్రశేఖర్‌ – అనితల కుమారుడు అంకిత్‌ సింగరేణి స్కూల్లో 6వ తరగతి చదువుతున్నాడు. సోమవారం సాయంత్రం 3 గంటల ప్రాంతంలో సహచర పిల్లలతో కలిసి నేరేడు పండ్ల కోసం వెళ్లి ఆలస్యంగా రాగా ఉపాధ్యాయుడు రాజుగౌడ్‌ చెంపపై కొట్టాడు. ఇంటికి వెళ్లి అంకిత్‌ తల్లిదండ్రులకు విషయం చెప్పడంతో మంగళవారం తల్లి అనిత స్కూల్‌కు వెళ్లి టీచర్‌ను ప్రశ్నించగా ఉపాధ్యాయుడు క్షమాపణ కోరాడని తెలిపింది. ఈ విషయమై సింగరేణి ఎడ్యుకేషన్‌ విభాగం డీజీఎం జీవీ మోహన్‌రావును వివరణ కోరగా తన దృష్టికి రాలేదని, అయినా విచారణ జరుపుతామని తెలిపారు.

పామాయిల్‌ గెలలు



టన్ను ధర	రూ.13,438

ప్రతి ఎకరాకూ నీరందించాలి

- మాజీ ఎమ్మెల్యేలు హరిప్రియ, గుమ్మడి నర్సయ్య డిమాండ్‌
- అఖిలపక్షం ఆధ్వర్యంలో సీతారామ ప్రాజెక్ట్‌ కాల్వల పరిశీలన



రోళ్లపాడు చెరువు వద్ద మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యేలు

అశ్వాపురం/జూలూరుపాడు/టేకులపల్లి : సీతారామ ప్రాజెక్ట్‌ ద్వారా జిల్లాలోని ప్రతి ఎకరాకూ సాగు నీరు అందించాలని మాజీ ఎమ్మెల్యేలు హరిప్రియ, గుమ్మడి నర్సయ్య ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో అశ్వాపురం మండలం కుమ్మరిగూడెంలో ఆనకట్ట, జూలూరుపాడు మండలం వినోభానగర్‌లోని ప్రాజెక్ట్‌ కెనాల్‌, టేకులపల్లి మండలంలోని రోళ్లపాడు చెరువును మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా హరిప్రియ, గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ.. దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద ఎప్పుడూ గోదావరి నీరు ఉంటుందని, ఉమ్మడి ఖమ్మం, మహబూబాబాద్‌ జిల్లాలకు సాగు నీరందించేందుకు మాజీ సీఎం కేసీఆర్‌ సీతారామ ప్రాజెక్ట్‌ నిర్మాణానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. అయితే ప్రస్తుత కాంగ్రెస్‌ ప్రభుత్వంలో సీతారామ ప్రాజెక్ట్‌ ద్వారా నీరు పుష్కలంగా ఉన్న ప్రాంతానికే మళ్లీ నీటిని తరలిస్తున్నారని ఆరోపించారు. జిల్లాలో గోదావరి ప్రవహిస్తున్నా సీతారామ ప్రాజెక్ట్‌ ద్వారా ఇక్కడి రైతులకు ఏమాత్రం ఉపయోగం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్ట్‌, కాల్వల నిర్మాణానికి భూములు కోల్పోయిన రైతులను విస్మరించడం తగదన్నారు. జిల్లా మంత్రులు స్పందించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. నాగార్జునసాగర్‌ కాలువ ఆయకట్టు స్థిరీకరణ పేరుతో పక్క జిల్లాలకు నీటిని మళ్లించే కుట్రలను తిప్పికొడతామని చెప్పారు. ఇల్లెందు నియోజకవర్గ రైతులకు అన్యాయం జరుగుతుంటే స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. 2016 ఫిబ్రవరి 16న తుమ్మల నాగేశ్వరరావు మంత్రిగా, కనకయ్య ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే రోళ్లపాడు వద్ద ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని, ఆనాడే రీడిజైన్‌ చేసి ఇల్లెందు ప్రాంతానికి చుక్క నీరు రాకుండా ఇతర ప్రాంతాలకు తరలించేలా చేశారని ఆరోపించారు. 2018లో ఇల్లెందుకు జరిగిన అన్యాయాన్ని కేసీఆర్‌కు వివరించి రూ.3,220 కోట్లతో ఇల్లెందు నియోజకవర్గం అంతా పచ్చగా ఉండేలా డీపీఆర్‌ అడ్మినిస్ట్రేషన్‌ అనుమతి పొందామని వివరించారు. నిధులు కేటాయించి, మంజూరైన ప్రాజెక్టును ఇప్పుడు ఇల్లెందుకు తెప్పించడంలో ప్రస్తుత ఎమ్మెల్యే విఫలమయ్యారని అన్నారు. ఇల్లెందు మీదుగా పాలేరు, డోర్నకల్‌, మానుకోట ప్రాంతాలకు నీరందిస్తూ ఈ ప్రాంతానికి అన్యాయం చేస్తున్నారని వాపోయారు. ఆయా కార్యక్రమాల్లో



వినోభానగర్‌లో సీతారామ కెనాల్‌ను పరిశీలిస్తున్న అఖిలపక్ష నాయకులు

అఖిలపక్ష నాయకులు ఏపూరి బ్రహ్మం, దేవరకొండ శంకర్‌, లక్కినేని సురేందర్‌రావు, దిండిగల రాజేందర్‌, బొమ్మెర వరప్రసాద్‌, బోడ బాలు, చీమల లక్ష్మీనారాయణ, బాలకృష్ణ, గుండెపిన్ని వెంకటేశ్వర్లు, బానోత్‌ ధర్మా, వై.గోపాల్‌రావు, యల్లంకి మధు, యాసా రోశయ్య, యల్లంకి శ్రీను, గుండెపిన్ని గోపాల్‌రావు, కొమ్మినేని క్రిష్ణమూర్తి, దుద్దుకూరి శ్రీనివాసరావు, మాళోతు శివనాయక్‌ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయండి..



మాట్లాడుతున్న ఎంపీపీ సీతారామరాజు

అశ్వారావుపేటరూరల్‌: ప్రభుత్వ శాఖల అధికారులంతా సమన్వయంతో పని చేయాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జీపీల ప్రత్యేకాధికారులు, వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. మండలంలోని 30 పంచాయతీలకు సంబంధించిన ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు వేర్వేరుగా ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని, ప్రతి అధికారికి మండలం, పంచాయతీలపై పూర్తి పట్టు ఉండాలన్నారు. ఒక్కొక్క కార్యదర్శికి పంచాయతీలో వనరులు, సమస్యలు కుడా తెలియకపోతే ఎలా అని ప్రశ్నించారు. సమావేశంలో ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్‌ కృష్ణప్రసాద్‌, కోఆప్షన్‌ సభ్యులు ఎస్‌కే పాషా పాల్గొన్నారు.

కాళ్లు పట్టుకుంటా.. మున్సిపాలిటీ చేయించండి..

'మీ కాళ్లు పట్టుకుంటా.. అశ్వారావుపేటను మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్‌ చేయించండి' అంటూ ఎంపీపీ సీతారామరాజు అన్నారు. మేజర్‌ పంచాయతీలో కార్యదర్శి ఒక్కరే ఉన్నారని, ఎల్‌డీసీ పోస్టు రద్దు కాగా, జూనియర్‌ అసిస్టెంట్‌ పోస్టు ఏళ్లుగా భర్తీ కాలేవడం లేదని, మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్‌ చేస్తే ఉద్యోగుల సంఖ్య పెరిగి, అభివృద్ధికి నిధులు వస్తాయని చెప్పారు. స్పందించిన ఎమ్మెల్యే ఆదినారాయణ మున్సిపాలిటీ చేయాల్సిన అవసరం ఉందన్నారు.

పరిహారం, ఉద్యోగం ఇస్తే భూములిస్తాం



సభలో మాట్లాడుతున్న గ్రామస్తుడు

మణుగూరు టౌన్‌: కన్నతల్లిలా తాము భావించే భూములు సింగరేణి విస్తరణకు కావాలంటే మెరుగైన ప్యాకేజీతో పాటు ఉద్యోగావకాశం కల్పిస్తామని రాతపూర్వక హామీ ఇవ్వాలని కొమ్ముగూడెం గ్రామస్తులు తేల్చిచెప్పారు. మణుగూరు ఓసీ విస్తరణకు భూసేకరణలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని కొమ్ముగూడెంలో మంగళవారం పీసా గ్రామసభ నిర్వహించారు. భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్‌, స్పెషల్‌ డిప్యూటీ కలెక్టర్‌, భూసేకరణ అధికారి సుమ పాల్గొని మాట్లాడుతూ మణుగూరు ఓసీ విస్తరణకు 11మంది నుంచి 20 ఎకరాలు సేకరించాల్సి ఉందని చెప్పారు. భూములు తీసుకుని 2013 చట్టం ప్రకారం ఉద్యోగం, ఆర్‌అండ్‌ఆర్‌ ప్యాకేజీగా ఎకరాకు రూ.20 లక్షలు ఇస్తామని రాతపూర్వకంగా హామీ ఇస్తేనే భూములు అప్పగిస్తామని రైతులు తేల్చిచెప్పారు. భూములు ఇవ్వదలుచుకున్న రైతులు చేతులు పైకి ఎత్తాలని కోరగా, ఎవరూ ఆమోదించకపోవడంతో త్వరలో మరో మారు గ్రామసభ నిర్వహిస్తామని అధికారులు వెనుతిరిగారు. ఏరియా జీఎం దుర్గం రాంచందర్‌, తహసీల్దార్‌ రాఘవరెడ్డి, మున్సిపల్‌ కమిషనర్‌ ఉమామహేశ్వరరావుతో పాటు సునీతా ఎలిజిబెత్‌, లక్ష్మణ్‌, శ్రీనివాసచారి, వెంకటేశ్వర్లు, రమేశ్‌, షబ్బీరుద్దీన్‌, రవికుమార్‌, నాగరాజు గ్రామపెద్దలు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్‌ కార్మికుల ఆత్మహత్యాయత్నం

కొత్తగూడెం జిల్లా ఆస్పత్రిలో ఘటన



సర్వజన ఆస్పత్రి భవనం పైకి ఎక్కిన కార్మికులు



కార్మికులతో మాట్లాడుతున్న సీఐ శివప్రసాద్‌

కొత్తగూడెంరూరల్‌: కొత్తగూడెంలోని సర్వజన ఆస్పత్రి భవనం పైకి ఎక్కిన నలుగురు కాంట్రాక్ట్‌ కార్మికులు మంగళవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అయితే, మిగతా ఉద్యోగులు, నాయకులు వారికి నచ్చజెప్పడంతో కిందకు దిగొచ్చారు. వివరాలిలా ఉన్నాయి. జిల్లా సర్వజన ఆస్పత్రిలో తమను పేషంట్‌ కేర్‌, శానిటరీ, సెక్యూరిటీ ఉద్యోగాల్లోకి తీసుకున్నప్పటికీ ఇప్పుడు కేవలం వాచ్‌మెన్‌ విధులే కేటాయిస్తున్నారని కార్మికులు భూక్యా జయకృష్ణ, లావుడ్యా నాగబాబు, మాలోతు సీతారాం, లకావత్‌ శంకర్‌రావు ఆరోపించారు. వారు మంగళవారం ఉదయం ఆస్పత్రి భవనంపైకి ఎక్కి ఆత్మహత్య చేసుకుంటామని తెలిపారు. మరో కార్మికుడు అజ్మీరా సరిలాల్‌ సైతం భవనం ఎక్కుతుండగా మిగతా ఉద్యోగులు, నాయకులు వీరన్న, జమలయ్య, రమేశ్‌ నచ్చజెప్పి కిందకు దించారు. అనంతరం కార్మికులు మాట్లాడుతూ.. తమను విధుల్లోకి చేర్చుకునే సమయాన మల్టీ టాస్క్‌ వర్కర్లుగా తీసుకోగా ఇప్పుడు కేవలం వాచ్‌మెన్‌ విధులే చేయాలని ఆదేశిస్తున్నారని తెలిపారు. ఈ విషయమై ఆర్‌ఎంఓ ప్రేమలతను వివరణ కోరగా, ఆస్పత్రిలో సెక్యూరిటీ సిబ్బంది కొరత ఉండటంతో సూపరింటెండెంట్‌ ఆదేశాలతో పనిచేయాలని సూచించినట్లు చెప్పారు. ఇదే అంశంపై మెడికల్‌ కాలేజీ ప్రిన్సిపాల్‌ లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ.. పది రోజుల నుంచి వారు ఉద్యోగాలకు రావడం లేదని తెలిపారు. పేషంట్‌ కేర్‌ విభాగంలో సరిపడా సిబ్బంది ఉన్నందున సెక్యూరిటీ విధులు నిర్వర్తించాలని సూచిస్తే ససేమిరా అంటున్నారని వెల్లడించారు. కాగా, విషయం తెలుసుకున్న సీఐ శివప్రసాద్‌ చేరుకుని కార్మికులను త్రీ టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌కు తీసుకెళ్లి ఆ తర్వాత కోర్టులో హాజరుపరిచారు. కోర్టు ఆదేశాలతో కేసు నమోదు చేస్తామని తెలిపారు.

గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు

కొత్తగూడెంటౌన్‌: గంజాయి అక్రమంగా తరలించినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని టూటౌన్‌ సీఐ రమేశ్‌కుమార్‌ హెచ్చరించారు. మంగళవారం రామవరంలోని మార్కెట్‌ సెంటర్‌, 14 నంబర్‌ ఏరియా, పంజాబ్‌గడ్డ బస్తీ, ఐటీఐ ప్రాంతాల్లో సీఐ ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం నార్కోటిక్స్‌ డాగ్‌లతో క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. గంజాయి లాంటి మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితమంతా అంధకారం నెలకొంటుందని, ఆరోగ్యం దెబ్బతింటుందని తెలిపారు. గంజాయి సమాచారం తెలిస్తే డయల్‌ 100కు వివరాలు చెప్పాలని సూచించారు.



తనిఖీల కోసం వెళ్తున్న డాగ్‌ స్క్వాడ్‌

గుట్కా ప్యాకెట్ల పట్టివేత

భద్రాచలంఅర్బన్‌: భద్రాచలం పట్టణం మీదుగా లారీలో గుట్కా ప్యాకెట్లు తరలిస్తుండగా బ్రిడ్జి సెంటర్‌ వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి భద్రాచలం టౌన్‌ పోలీసులు అధికారికంగా వివరాలు వెల్లడించాల్సి ఉంది.

రేషన్‌ బియ్యం పట్టివేత

జూలూరుపాడు: అక్రమంగా ఓ ఇంట్లో నిల్వ చేసిన రేషన్‌ బియ్యాన్ని మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. ఏఎస్‌ఐ కోటేశ్వరరావు కథనం ప్రకారం.. జూలూరుపాడు రామాలయం వీధిలోని నాగేశ్వరరావు ఇంట్లో అక్రమంగా రేషన్‌ బియ్యం నిల్వ చేశారనే సమాచారంతో సోమవారం రాత్రి దాడులు నిర్వహించి సుమారు 6 క్వింటాళ్ల రేషన్‌ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పౌర సరఫరాల శాఖ అధికారులకు బియ్యం అప్పగించి, సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఏఎస్‌ఐ పేర్కొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పాల్వంచరూరల్‌: మొర్రేడు వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మంగళవారం పట్టణ పోలీసులు పట్టుకున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనివాసకాలనీ సమీపంలో మొర్రేడు వాగు నుంచి ఇసుకను రెండు ట్రాక్టర్లలో తలిస్తున్నారు. దమ్మపేట సెంటర్‌లో ట్రాక్టర్లను పట్టుకుని యజమానులు హనుమంతరావు, సున్నం దావీద్‌, డ్రైవర్లు వీరభద్రం, చిన్నాపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రాము తెలిపారు.

పశువుల పట్టివేత

భద్రాచలంఅర్బన్‌: భద్రాచలం పట్టణంలో మంగళవారం అక్రమంగా ట్రాలీఆటోలో తరలిస్తున్న పశువులను పోలీసులు పట్టుకున్నారు. ఒక ఆవు, 5 లేగ దూడలను ఛత్తీస్‌గఢ్‌లో తక్కువ ధరకు కొనుగోలు చేసి బూర్గంపాడు మండలంలోని మోరంపల్లి సంతలో అధిక ధరకు అమ్మకానికి తీసుకుని వెళ్తూ పట్టుబడగా పశువులను పోలీస్‌స్టేషన్‌కు తరలించామని, తరలిస్తున్న సారపాక పరిధి గాంధీనగర్‌కు చెందిన యాకూబ్‌పై కేసు నమోదు చేశామని టౌన్‌ ఎస్‌ఐ పీవీఎన్‌ రావు తెలిపారు.

చెట్లు నరికినవారిపై కేసు

దమ్మపేట: మండలంలోని నాగుపల్లి గ్రామ శివారులోని వ్యవసాయ క్షేత్రంలోకి ప్రవేశించి, చెట్లను నరికిన వ్యక్తులపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ధరావత్‌ నారాయణకు గ్రామ శివారులో 2.25 ఎకరాల జీడిమామిడి తోట ఉంది. మంగళవారం అదే గ్రామానికి చెందిన నల్లి గాంధీ, నాగమణి, షేక్‌ సొందులతో పాటుగా మరో ఆరుగురు వ్యక్తులు తోటలోకి ప్రవేశించి, 15 జీడిమామిడి చెట్లను నరికేశారు. నారాయణ ఫిర్యాదు మేరకు భారతీయ న్యాయ సంహిత చట్టం ప్రకారం తొలి కేసు నమోదు చేశామని ఎస్‌ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

కొత్తగూడెంఅర్బన్‌: కొత్త పోలీస్‌, న్యాయ చట్టాలు సోమవారం నుంచి అమలులోనికి రాగా త్రీటౌన్‌ పోలీస్‌ స్టేషన్‌లో మంగళవారం తొలి వరకట్న వేధింపుల కేసు నమోదైంది. త్రీటౌన్‌ సీఐ శివప్రసాద్‌ కథనం ప్రకారం.. చుంచుపల్లి మండలం విద్యానగర్‌కు చెందిన గజ్జల అనిల్‌కుమార్‌కు కొత్తగూడెం పట్టణం ప్రగతినగర్‌కు చెందిన మహిళతో వివాహమైంది. మహిళ లావుగా ఉందని, అదనపు కట్నం కావాలని భర్త అనిల్‌కుమార్‌, అత్త మామలు పద్మావతి, వెంకటేశ్వరరావు వేధింపులకు గురిచేస్తున్నారు. దీంతో బాధితురాలు త్రీటౌన్‌ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సీఐ శివప్రసాద్‌ విచారణ చేసి నూతన చట్టం ప్రకారం వరకట్న వేధింపుల కేసు నమోదు చేశారు.

గాయపడిన వ్యక్తి మృతి

అశ్వాపురం: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మంగళవారం మృతి చెందాడు. గత నెల 17న మండలంలోని మల్లెలమడుగు గ్రామానికి చెందిన దాసరి రవికృష్ణ (26) బైక్‌పై అశ్వాపురం నుంచి మొండికుంట వైపు వస్తూ గొల్లగూడెం వద్ద అదుపుతప్పి గేదెను ఢీకొట్టాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రవికృష్ణను భద్రాచలంలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. రవికృష్ణ మృతితో మల్లెలమడుగు ఎస్సీ కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి.

నేడు స్వస్థలానికి విద్యార్థి మృతదేహం

కల్లూరురూరల్‌: అమెరికాలో ఎంఎస్‌ చదువుతూ ప్రమాదవశాత్తు ఈత కొలనులో మృతి చెందిన కల్లూరు మండలం చిన్నకోరుకొండికి చెందిన శ్రీనాథరాజు కిరణ్‌(20) మృతదేహానికి మంగళవారం అక్కడి శాండిల్‌ ఎస్‌టౌన్‌లో పోస్టుమార్టం పూర్తయినట్లు తెలిసింది. అమెరికాలో చదువుతున్న కల్లూరు మండలానికి చెందిన శ్రీనివాసరావు, కంపాటి ఆంజనేయులు, రెడ్డిచర్ల హన్మంతు, తిరుమలశెట్టి గోపితో పాటు మరికొందరు ఎన్నారైలు కిరణ్‌ మృతదేహన్ని ఇండియా తరలించేందుకు చేయూతనిచ్చారు. ఈమేరకు విమానంలో హైదరాబాద్‌కు బుధవారం రాత్రి మృతదేహం చేరుకోనుండగా, అక్కడి నుంచి రోడ్డుమార్గంలో చిన్న కోరుకొండికి గురువారం ఉదయం తీసుకురానున్నారు.

దాడిపై కేసు నమోదు

నేలకొండపల్లి: భూతగాదాల నేపథ్యాన జరిగిన దాడిపై మంగళవారం కేసు నమోదైంది. నేలకొండపల్లి మండలం మంగాపురం తండాకు చెందిన భూక్యా పూషా, ఆమె భర్త రామచంద్రు గత శుక్రవారం సాయంత్రం బైక్‌పై పొలం నుంచి ఇంటికి వస్తుండగా అదే గ్రామానికి చెందిన కొండలరావు అడ్డుకుని దాడి చేశాడు. ఈఘటనలో పూషా తీవ్రంగా గాయపడగా బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తోట నాగరాజు తెలిపారు.

తుక్కులోనూ భారీ కుంభకోణం?

- తక్కువ కోట్‌ చేసి భారీ ఎత్తున స్కాం చేశారనే చర్చ
- ఇప్పటికే కర్మాగారాన్ని రెండు సార్లు సందర్శించిన ఎమ్మెల్యే
- జిల్లా కలెక్టర్‌ సమక్షంలో అధికారులపై ఆగ్రహం
- తరలింపు పనులకు తాత్కాలికంగా బ్రేక్‌?



కేటీపీఎస్‌ పాత ప్లాంట్‌ను తుక్కుగా మార్చిన దృశ్యం

పాల్వంచ: కాలం చెల్లిన కేటీపీఎస్‌ ఓఅండ్‌ఎం (పాత ప్లాంట్‌) నుంచి తుక్కు తరలింపు వ్యవహారం దుమారం రేపుతోంది. ఇప్పటికే కర్మాగారంలోని అనేక కీలక విభాగాలకు చెందిన సామగ్రి తరలింపు ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. పనులు చివరి దశకు వస్తున్న క్రమంలో ఇక్కడి తుక్కు అమ్మకం పేరుతో రూ.కోట్లను పక్కదారి పట్టించి భారీ స్కాంకు పాల్పడ్డట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. రోజురోజుకూ ఈ వ్యవహారం చిలికిచిలికి గాలి వానగా మారుతుండటంతో పాటు రాష్ట్రవ్యాప్త చర్చకు దారితీస్తోంది. నిబంధనల మేరకు జరుగుతున్నాయంటూ జెన్‌కో యాజమాన్యం చెబుతున్నప్పటికీ తక్కువ కోడ్‌ చేసి ఆదిలోనే భారీ అవినీతికి పాల్పడ్డారంటు సాక్షాత్తూ స్థానిక ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆగ్రహం వ్యక్తం చేయడంపై సందేహాలకు మరింత ఊతమిస్తోంది. దీనిపై ఇప్పటికే కూనంనేని సాంబశివరావు కర్మాగారాన్ని రెండు దఫాలుగా సందర్శించి వెంటనే తరలింపు పనులు నిలిపివేయాలంటూ అధికారులను ఆదేశించారు. గత సోమవారం జిల్లా కలెక్టర్‌ జితేశ్‌ వి పాటిల్‌ను కర్మాగారానికి రప్పించి తరలింపు ప్రక్రియ తీరును వివరించారు. అక్కడే కేటీపీఎస్‌ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.


తరలింపులో లోపాలెన్నో!

కేటీపీఎస్‌లోని ఏ, బీ, సీ స్టేషన్లను 1966 – 70 దశకంలో నిర్మించారు. ఈ స్టేషన్లు కాలం చెల్లడంతో అందులో విద్యుత్‌ ఉత్పత్తిని 2019లో నిలిపివేశారు. అప్పటివరకు వినియోగిస్తూ వచ్చిన ట్రాన్స్‌ఫార్మర్లు, టర్బైన్లు, కన్వేయర్లు, కూలింగ్‌ టవర్లు, బాయిలర్లు, చిమ్నీలు, జనరేటర్లు, షెడ్లు, ఇతర బ్లాక్‌లన్నింటిని తుక్కుగా మార్చి కొనుగోలు చేసేందుకు హెచ్‌ఆర్‌ కమర్షియల్‌ సంస్థ రూ.485 కోట్లకు టెండర్‌ దక్కించుకుంది. ముందుస్తుగా రూ.144 కోట్లు చెల్లించి పనులు ప్రారంభించింది. ప్రతి వస్తువును కట్‌ చేసి ముక్కలుగా మార్చి తుక్కుగా చేసి తరలిస్తున్నారు. అయితే ఈ తరలింపు ప్రక్రియలో అనేక లోపాలున్నట్లు ఆది నుంచి ఆరోపణలున్నాయి. ప్రభుత్వం మారిన తర్వాత ఆరోపణల నిగ్గు తేల్చేందుకు ఎమ్మెల్యే కూనంనేని ప్రత్యేక దృష్టి సారించారు.

ఆరోపణలు తేల్చేవరకు పనులు ఆపాలి..

పాత ప్లాంట్‌ కూల్చివేత పనుల్లో అనేక లోపాలున్నాయని, పారదర్శకత లోపించిందని, నిజాలు నిగ్గు తేల్చే వరకు తరలింపు పనులు నిలిపివేయాలని ఎమ్మెల్యే కూనంనేని డిమాండ్‌ చేస్తున్నారు. ఈ క్రమంలో జిల్లా కలెక్టర్‌ జితేశ్‌ వి పాటిల్‌తో కలిసి కర్మాగారాన్ని సందర్శించి అప్పటి ఒప్పంద పత్రాలన్నింటినీ పరిశీలించి లోతుగా అధ్యయనం చేశారు. తాను గత నెల 21వ తేదీన కర్మాగారాన్ని సందర్శించి తుక్కు తరలింపులో అనేక అనుమానాలున్నాయని వాటిని నివృత్తి చేసే వరకు పనులు నిలిపివేయాలని చెప్పినా తన మాట దిక్కరించి పనులు కొనసాగిస్తుండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత కలెక్టర్‌ వెళ్లిపోయిన తర్వాత పాత తేదీతోనే కూలింగ్‌ టవర్‌కు అనుమతులు తీసుకున్నట్లు సమాచారం ఉందన్నారు. అంతేగాక టెండర్‌ ప్రక్రియలోనే తక్కువ కోడ్‌ చేసి భారీ అవినీతికి పాల్పడ్డారని, తొలగించిన చెట్లు, ఫర్నిచర్‌ ఎక్కడికి పంపించారని, వాటి వివరాలు పూర్తిగా తెలియాలని పేర్కొన్నారు. ఆగమేఘాల మీద కూలింగ్‌ టవర్లు కూల్చివేస్తే భవిష్యత్‌లో కొత్త కర్మాగారం వస్తే ఎలాఅని, దీనిపై అధ్యయనం చేయాల్సి ఉందని, భవిష్యత్‌లో అసెంబ్లీలో ఈ సమస్యలన్నీ ప్రస్తావిస్తానని హెచ్చరించడంతో ఈ అంశం ఇప్పుడు హాట్‌ టాపిక్‌గా మారింది. అయితే, తరలింపు పనులకు తాత్కాలికంగా బ్రేక్‌ పడినట్లు తెలుస్తోంది. ఈ విషయమై 7వ దశ సీఈ పి.వెంకటేశ్వరరావును వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేరు.

అవకతవకలపై అసెంబ్లీలో ప్రస్తావిస్తా



కేటీపీఎస్‌ పాత ప్లాంట్‌ను ఆగమేఘాల మీద కూల్చాల్సిన అవసరం ఏముంది. ఈ పనులను కాంట్రాక్ట్‌ సంస్థకు అప్పగించేప్పుడే తక్కువ కోడ్‌ చేసి, రూ.కోట్ల ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేశారు. అనుకున్న దానికంటే ఎక్కువ మొత్తంలో తుక్కు వెళ్లిందనే ఆరోపణలు వస్తున్నాయి. అనుమానాలన్నింటినీ ప్రత్యేక విచారణ కమిటీ వేసి నిజాలు నిగ్గుతేలిస్తే ఎలాంటి ఇబ్బంది ఉండదు. కానీ, పాత ప్లాంట్‌ స్థానంలో కొత్త ప్లాంట్‌ ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతం అభివృద్ధి జరిగే అవకాశం ఉంది. ఇక్కడి అధికారుల్లో సైతం పారదర్శకత లోపించింది. ఈ విషయాలన్నింటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు అసెంబ్లీలో ప్రస్తావిస్తా.

– కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్యే, కొత్తగూడెం